# సింగిల్ పేజీ కథలు

## ఉపాయం

**కోఠీకి వెళ్లే బస్ ఎక్కింది సునంద. కోఠీ ఉమెన్స్ కాలేజీలో బిఎస్‌సి కంప్యూటర్స్ చేస్తున్న సునంద ప్రతిరోజూ అదే టైముకి అడిక్‌మెట్‌లో కాలేజీ ముందు దిగుతుంది.**

ఎప్పటిలాగే ఆరోజూ బస్సెక్కింది సునంద. పీక్ అవర్సేమో బస్ ప్రయాణీకులతో రద్దీగా వుంది. పాసింజర్స్ ఒకరినొకరు తోసుకుంటూ నిలబడ్డారు. కూర్చొనేందుకు ఎక్కడా సీటు కనబడకపోవడంతో చేసేదేం లేక ఉస్సూరుమంటూ నిలబడింది సునంద.

ఇంతలో ''హాయ్ సునీ!'' అన్న పిలుపు వినబడడంతో వెనక్కి తిరిగి చూసిన సునందకు చేయి ఊపుతూ కనబడింది క్లాస్‌మేట్ ప్రత్యూష.

''హాయ్ ప్రీతీ!'' అంటూ తనూ తిరిగి విష్ చేసి తన దగ్గరికి రమ్మంటూ సైగ చేసింది సునంద.

అందర్నీ తోసుకుంటూ, తొక్కుకుంటూ, తొక్కినందుకు చివాట్లు తింటూ సునంద వెనక్కి వచ్చి నిలబడింది ప్రత్యూష.

ప్రతిరోజూ తండ్రితోపాటు కార్లో వస్తుంది ప్రత్యూష. తను ఆఫీసుకెళ్తూ దార్లో కాలేజీ దగ్గర ఆమెని దింపి వెళ్తాడు వాళ్ళ డాడీ. ఈరోజు ఆ అలవాటుకి విరుద్ధంగా బస్సులో రావడం ఆశ్చర్యం అన్పించి ''నువ్వేమిటి తల్లీ ఇలా బస్సులో దిగబడ్డావ్. కారుకు ఏమయింది ఇవాళా?'' అంటూ ప్రశ్నించింది సునంద.

''కారుకేమీ కాలేదు. నిక్షేపంలా వుంది. కానీ ఓసారి నీతోపాటు బస్సులో ప్రయాణిస్తే ఎలావుంటుందో చూద్దామనిపించి బస్సెక్కాను'' అంది ప్రత్యూష సునందతో హాస్యంగా.

''నోర్మూయ్యవే! నువ్వు నాతోపాటు ప్రయాణిద్దామని బస్‌లో ఎక్కేవా? ఈ ఒక్క రోజెందుకు? రోజూ ఎక్కచ్చుగా. కోతలు చాలుగాని అసలు సంగతి చెప్పు'' అంది సునంద కోపంగా.

''అబ్బ! అంతకోపం ఎందుకే బాబూ! అర్జంటు పని వుందని మా డాడీ ఈరోజు పొద్దున్నే ఆఫీసుకెళ్ళిపోయారు. అందుకే కార్లో రాలేకపోయాను'' అంది ప్రత్యూష.

''ఉహు! అలాగ'' అంది సునంద.

అంతే ఇద్దరూ కబుర్లలో పడిపోయారు. అక్కడక్కడా ఆగుతూ తన గమ్యంవైపు సాగుతోంది బస్సు.

ఎక్కే పాసింజర్లు ఎక్కుతూ వుంటే దిగే పాసింజర్లు దిగుతున్నారు. ఇదేం పట్టని సునంద, ప్రత్యూషలు కబుర్లలో మునిగితేలుతున్నారు.

ఉన్నట్టుండి వాళ్ళ మాటలకి బ్రేక్ వేస్తూ మెడ మీద ఏదో పాకినట్టుగా అన్పించింది ప్రత్యూషకి. ఉలిక్కిపడి గబగబా చేత్తో దులిపేసి తిరిగి కబుర్లలో పడింది ప్రత్యూష.

పదినిమిషాల కాలం ప్రశాంతంగా గడిచింది.



తిరిగి ఈసారి జాకెట్‌కి నడుముకు మధ్య మళ్ళీ ఏదో పాకినట్టుగా అన్పించి అనుమానంగా వెనక్కి తిరిగి చూసింది ప్రత్యూష. చేతిని వెనక్కి తీసుకుంటూ వెకిలిగా పళ్ళికిలిస్తున్న యాభయ్యేళ్ళ వ్యక్తి కనిపించాడు. 'ఇంతసేపూ ఏదో పాకుతున్నట్టుగా అన్పించింది ఈ రాస్కెల్ నిర్వాకం అన్నమాట. నేడో రేపో రిటైరయ్యేలా వున్నాడు ఇదేం బుద్ధి. ఛీ ఛీ!' అనుకుంది ప్రత్యూష.

అతని చేష్టలకు ఒళ్ళు కంపరమెత్తిపోయినట్టుగా అయింది ప్రత్యూషకి. తన కూతురు వయసున్న తన పట్ల అతని అసభ్య ప్రవర్తనకు అసహ్యం వేసింది. ఏం చెయ్యాలో తోచక ఛీత్కరించుకున్నట్టుగా చూసి మొహం తప్పుకుంది ప్రత్యూష. తన చేష్టలకి ఎటువంటి ప్రతిఘటన చూపకుండా మొహం తిప్పుకున్న ప్రత్యూషని చూసి ధైర్యం రెట్టింపవగా ఈసారి ఇంకొంచెం గట్టిగా నడుం మీద వత్తి వదిలాడు ఆ వ్యక్తి.

ఇలాంటి అనుభవం ఇదే మొదటిసారి అవడంతో కంగారుపడింది ప్రత్యూష. అతన్నుంచి తప్పించుకుందుకు ముందుకు జరగడం మొదలుపెట్టింది.

ప్రత్యూష పడ్తున్న అవస్థ గమనించిన అతను ముసిముసిగా నవ్వుకుంటూ ఎవరూ గమనించకుండా తనూ ముందుకు జరగడం మొదలెట్టాడు. ఈ ప్రయత్నంలో ప్రత్యూషను దాదాపు తాకుతున్నంత దగ్గరగా వచ్చేశాడు. అతని ఊపిరి వెచ్చగా మెడమీద తాకుతోంది ప్రత్యూషకి. ఒళ్ళంతా నూట ఐదు డిగ్రీల జ్వరం వచ్చినట్టుగా అయిపోయింది. ఇవేమీ తెలియని సునంద ఏవేవో చెప్తోంది. అవేమీ తలకెక్కటం లేదు ప్రత్యూషకి. అతన్నుంచి తప్పించుకునే మార్గాలను అన్వేషిస్తోంది ప్రత్యూష మనసు.

ఏదో అడిగిన సునంద తన ప్రశ్నకు బదులు రాకపోవడంతో ప్రత్యూష ఏం చేస్తోందా అని వెనుదిరిగి చూసింది. ఏదో గాభరాగా, టెన్షన్‌గా ఉన్న ప్రత్యూష కనిపించింది.

''ఏమయింది ప్రతీ? ఎందుకలా వున్నావ్?'' అని అడిగిన సునందకి సంగతంతా చెప్పింది ప్రత్యూష.

నువ్వు ఈరోజే కొత్త. మొదటిసారి బస్సులో ప్రయాణిస్తున్నావ్ కాబట్టి నీకు కొత్తగా వుంది. రోజూ బస్సులో ప్రయాణించేవారికి ఎదురయ్యే తతంగమే ఇది'' అంటూ ''నువ్వు నా ప్లేస్‌లోకి రా. నేనటు వెళ్తాను'' అంది సునంద.

''అదేమిటే! నువ్వు మాత్రం ఆడపిల్లవు కావా ఏమిటి? నిన్ను మాత్రం వదులుతాడా ఆ రాస్కెల్'' అంది ప్రత్యూష.

''అదంతా నీకెందుకు? నువ్విటు రా ముందు'' అంది సునంద.

''పోనీ ఓ పని చేస్తేనో?'' అంది ప్రత్యూష.

''ఏమిటి?'' అడిగింది సునంద.

''గట్టిగా చడా మడా నాలుగు దులిపేస్తే?''

''దానివల్ల లాభం కన్నా నష్టమే ఎక్కువ. అందరూ మననే అంటారు. అంత చెయ్యికూడా తగలకుండా వుండాలంటే ఏ కార్లోనో, ఆటోలోనో వెళ్తే సరి అంటారు. అది చూసుకొనే

ఇలాంటి సందర్భాల్లో ఈ రాస్కెల్స్ విజృంభిస్తూ వుంటారు'' అంది సునంద.

''మరేం చేద్దాం?'' బేలగా అడిగింది ప్రత్యూష.

''నీకెందుకు నువ్విటురా ముందు'' అంటూ ప్రత్యూషని ముందుకి నెట్టి తను ప్రత్యూష ప్లేస్‌లోకి వెళ్ళి నిలబడింది సునంద.

పెద్ద హీరోయిన్‌లా వెనక్కి వచ్చిన సునందని చూసి నువ్వు ఆడదానివేగా నువ్వేం చేయగలవు అన్నట్టు కాలరెగరేస్తూ వెకిలిగా నవ్వాడా వ్యక్తి. ఏం చేస్తుందో చూద్దాం అన్నట్టు వేళ్ళను పైపైకి పోనిస్తూ ఎక్కడెక్కడో తడమడం ప్రారంభించాడు.

ఆ స్పర్శ జుగుప్సాకరంగా అనిపిస్తున్నా కాసేపు మెదలకుండా తనని కానట్టు కదలకుండా నిలబడింది సునంద.

తన చేష్టలకి సునందలో ఎటువంటి వ్యతిరేకతా కనబడకపోవడంతో ఆమె చేతకానితనం వినోదభరితంగా అన్పించి మరింతగా విజృంభించడం మొదలుపెట్టాడు ఆ వ్యక్తి.

ప్రయాణీకులు ఎవరి గొడవల్లో వాళ్ళు వున్నారు. తన క్రీడ సాగిస్తూనే వున్నాడా వ్యక్తి. అతని చేతివేళ్ళు ఎక్కడెక్కడో సంచరిస్తూ నెమ్మదిగా సునంద పొట్టను చేరాయి. అంతవరకూ నిశ్శబ్దంగా అతని చర్యలను ఓ కంట కనిపెడుతున్న సునంద చటుక్కున ఆ చేతిని ఒడిసి పట్టుకుంది. అంతే.. ఆ వ్యక్తి కంఠం నుండి బాధతో కూడిన పెనుకేక వెలువడింది. బాధతో విలవిల్లాడుతూ తన చేతివేపు చూసుకున్నాడు. మణికట్టు దగ్గర నుండి రక్తం ధారగా కారుతోంది. బస్ సడన్‌బ్రేక్‌తో ఆగిపోయింది. బిగ్గరగా కేక వినపడడంతో ఏమయిందోనని ప్రయాణీకులంతా కంగారుగా వెనక్కి చూశారు. బాధగా రక్తం కారుతున్న చేతిని ఒడిసి పట్టుకుని ఆ వ్యక్తి కనబడటంతో ఏమయిందని ప్రశ్నిస్తూ బస్సులో ప్రయాణీకులంతా సీట్లలోంచి లేచి అతనివైపు రావడం ప్రారంభించారు. తనవైపు వస్తున్న ప్రయాణీకులని చూసి విషయం బయట పడిపోతుందని కంగారుపడి గభాలున ఆగిన బస్సులోంచి కిందకి ఒక్క ఉరుకు ఉరికి అటుగా పోతున్న ఆటోనాపి ఎక్కి పోనీయమన్నాడు అతను. అందరూ అయోమయంగా అతను వెళ్ళిన దిక్కు చూస్తూంటే, వాడిగా కత్తుల్లా మొనదేలిన చేతి గోళ్ళ వంక చూసుకుంటూ ముసిముసిగా నవ్వుకుంది సునంద.


**-పి.లక్ష్మి (హైదరాబాద్)**

# ఆశ

**రోజూ కంటే ఆవేళ ముందుగా లేచింది శారద. అసలు ఆ రాత్రి ఆమెకు నిద్రపడితేనా? లేస్తూనే కూనిరాగాలు తీస్తూ పనిపాటల్లో పడింది.**

రస్న పొడరు నీళ్ళలో కలిపి డ్రింక్ తయారుచేసి ఫ్రిజ్‌లో పెట్టింది. హాలంతా శుభ్రం చేసి సోఫాలు సర్దింది. ఫ్లవర్‌వాజ్‌లో పూలు మార్చింది. ఫిల్టరు తీసి కాఫీ కలిపింది. బద్ధకిస్తున్న భర్తను బలవంతంగా లేపి బాత్‌రూమ్‌లోకి నెట్టింది. ఆరోజు ఆమె మనసు ఎంతో ఉల్లాసంగా వుంది. ఆవేళ జనవరి ఫస్ట్. న్యూ ఇయర్ డే. మగడికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు ఎంతోమంది వస్తారు. ఎన్నెన్నో కానుకలు తెస్తారు. అదన్నమాట ఆమె సంబరానికంతటికీ కారణం. ఉన్నట్లుండి గత నూతన సంవత్సర వైభవం కళ్ళముందు మెదిలింది.

శారద భర్త శంకర్రావుకి పబ్లిక్ రిలేషన్ ఆఫీసరుగా ప్రమోషనొచ్చింది. సహజంగా మనిషి మంచివాడు కావడం వల్ల ఆ సంవత్సరం అతడికి న్యూ ఇయర్ గ్రీటింగ్స్ చెప్పేందుకు ఎంతోమంది వచ్చారు. వచ్చినవాళ్ళు ఉత్తచేతుల్తో రారుకదా! ఎవరికి తోచిన కానుక వారు పట్టుకొచ్చారు. నాడు శ్రీనివాసుడి కళ్యాణానికి కుబేరుడు కురిపించిన కాసుల్ని కొలిచేసరికి శోష వచ్చి పడిపోయాడట గోవిందరాజులు. మరి నేడు అసంఖ్యాకంగా భర్తకొచ్చిపడ్డ గిఫ్ట్ ప్యాకెట్లు విప్పేసరికి శారద భొంగరప్పుకీలు అరిగిపోయింది. డైనింగ్ సెట్టు, వాటర్ ఫిల్టరు, కుక్కరు, మిక్సీ, మినీ గ్రైండరు, కెమేరా, ఆల్బం, పెన్‌సెట్... ఇలా ఎన్నో ఎన్నెన్నో ప్రెజెంటేషన్లు కుప్పలు తెప్పలుగా వచ్చిపడ్డాయి. వాటినన్నింటిని ఏం చేసుకోవాలో తెలీక కొన్నింటిని అమ్మేసి సొమ్ము చేసుకుంది. వచ్చిన డబ్బుతో హారం



చేయించుకుంది. పోయిన ఏడు కంటే ఈ ఏడు రెట్టింపు బహుమతులు రావచ్చు. అంతే, రవ్వల నెక్లెస ఆమె కళ్ళముందు మెరిసింది.

ఏడు.. ఎనిమిది.. తొమ్మిది.. పది.. ఆమె మనోవేగాన్ని మించిపోయింది కాలవేగం. ఎందుకో శంకర్రావుకి గ్రీటింగ్స్ చెప్పేందుకు ఆవేళ ఒక్కరంటే ఒక్కరు రాలేదు. గంటలు గడుస్తున్నకొద్దీ ఆమె ఉత్సాహం నీరుగారిపోతోంది. ఎంత తమాయించుకుంటున్నా దుఃఖం ఆగడం లేదు. ఇంకా ఏదో ఆశ. ఆలస్యంగానైనా అభిమానులు రాకపోతారా అన్న ఆరాటం.

ఈ నిరీక్షణలో పదకొండు దాటింది. ఉదయం పడ్డ ఉడుకునీళ్ళు తప్ప ఇంకేం లేకపోవడంతో శంకర్రావు కడుపులో ఎలకలు పరిగెడుతున్నాయి.

''ఇవాళ వంట చేసే యోచనేమైనా వుందా లేదా?'' అని అడిగేసాడు మరి ఉండలేక.

''వంటకేం భాగ్యం. అరగంటలో చేసి పెడతాను. అప్పుడే ఆకలేస్తోందా ఏవిటి? ఔనూ! ఇవాళ మీకు గ్రీటింగ్స్ చెప్పేందుకు ఎవరూ రాలేదేమిటండి'' అనుమానం నివృత్తి చేసుకునేందుకు అడిగేసింది శారద. ఆ మాట అంటున్నప్పుడు ఆమె కళ్ళు చెమ్మగిల్లడం గమనించకపోలేదు శంకర్రావు.

''పిచ్చిదానా! నిన్న డిసెంబరు ముప్పై ఒకటిన రిటైరయిపోయాను కదే. పదవీ విరమణ చేసిన అధికారితో ఇంకేం పని ఉంటుంది? పొద్దున్నుంచి నువ్వు తెగ హైరానా పడిపోతూంటే ఎందుకో అనుకున్నాను. ఇందుకన్నమాట!'' అన్నాడు నవ్వుతూ.

''అదేవిటండి నిన్న సాయంత్రమే కదా మీరు రిటైరయ్యారు. ఇంతవరకు మీవల్ల లబ్దిపొందిన వాళ్ళంతా అప్పుడే మరచిపోతారా? ఆశ్చర్యంగా వుందే...''

''వాళ్ళు నన్ను మరచిపోవడం ఆశ్చర్యం కాదు. నువ్వు అతిగా ఆశించడమే విడ్డూరంగా వుంది. లే, లేచి భోజనం సంగతి చూడు'' ఓదార్పుగా అన్నాడు శంకర్రావు.

**-దూరి వెంకటరావు**

**(దానన్నపేట)**